# జైలు కథలు 16

## "రక్త తర్పణం"

"చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే, ఎంత చిన్నదైనాసరే, వొక దీపాన్ని వెలిగించటం మంచిది" వివేకానందుని సూక్తులు చదువుతూ, బ్లాక్ బయట వరండాలో కూర్చున్నాను.

"ప్రసాద్" తలెత్తి చూశాను. ఎదురుగా వంటచేసే నాయర్ నిల్చునున్నాడు. ఏమిటన్నట్లు చూశాను.

"ఆ వెళ్ళే గళ్ళచొక్కా కుర్రాణ్ణి చూశారా?"

అప్పుడు చూశాను. మా ముందునుంచి వెళుతున్న సదరు గళ్ళచొక్కాను. పంచె కట్టు, పైపంచె వున్నాయి సంస్కారంలేని జుత్తు. బాల్యం వదలిన ఛాయలు పోలేదు ముఖంలో యింకా. వయసు యిరవయిలోపు వుండవచ్చు. విద్యాగంధం వున్నట్టు లేదు.

"మర్డరు కేసు" నా సమాధానంతో సంబంధం లేకుండానే చెప్పాడు నాయర్.

"ఎంతమంది?" "పదిహేడు మంది"

చేతిలో పుస్తకం జారిపోయింది. యధాలాపంగా ప్రశ్నించినా, సమాధానానికి మాత్రం బిత్తరపోయాను.

ఇక అతని గురించి తెలుసుకోకుండా వుండలేకపోయాను.

*　　*　　*

షాద్‌నగర్ తాలూకా పరిధిలోని వొక కుగ్రామం నరసారెడ్డిగారిది స్థితికలిగిన వారు. అవసరాలకు మించిన భూమి వుంది. కాని సంతానమే లేదు. వారింట్లో పని చేస్తుండేవాడు వేణు. వూహ తెలిసిన నాటి నుంచి, వారినే అమ్మ, నాన్నలుగా వ్యవహరించేవాడు కన్న తల్లి తండ్రి తనకు తెలియదు. కాని గ్రామస్థుల ద్వారా వేణు విన్నది యిది. ఆ గ్రామంలో వున్న యాదయ్య, సూరమ్మలు హరిజన దంపతులు. కడు బీదవారు. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. వారిద్దరి ప్రేమ ఫలం బాబు. బాబుకు మూడు నెలలైనా నిండకముందే సూరమ్మ కూలికి వెళ్ళాల్సిన నిరుపేదతనం వారిది. సీసాలో పాలుపట్టి, బాబును ప్రక్కింటివారి అమ్మాయికి అప్పగించి వెళ్ళేది. కన్న మమకారం కాదంటున్నా పరిస్థితులుమాత్రం వారిని పనికి పరుగు తీయిస్తూనే వున్నాయి. సాయంకాలం పనినుండి తిరిగి వస్తూనే, బాబు ముద్దూ మురిపెంతో, చేసిన కష్టం మరచిపోయి ఆనందించేవారు. కాలం గడుస్తూ వుంది.

ఒక దుర్దినాన బాబును వదలి పనికి వెళ్ళిన యాదయ్య, సూరమ్మలు మరి తిరిగి రాలేదు. గనిలో జరిగిన ప్రమాదంలో సజీవ సమాధి చేయబడ్డారు. విషయం తెలిసిన నరసారెడ్డి భార్య భర్తను ప్రోత్సహించింది. నరసారెడ్డి హరిజనవాడ పెద్దతో సంప్రదించి, యాదయ్య, సూరమ్మల బంధువుల సమ్మతితో బాబును ఇంటికి తెచ్చుకున్నాడు. "వేణుగోపాల్" అని నామకరణం చేసి, "వేణు" అని ముద్దుగా పిలుచుకొనేవారు. వేణు రాక ఆ దంపతులకు పండుగే అయింది. పిల్లలు లేని ఆ ఇల్లు నవ్వులతో, కేరింతలతో నిండిపోయింది.



పెరిగి పెద్దవాడైన వేణుకు విద్య తప్ప అన్ని వ్యవసాయ పనులూ చక్కగా అబ్బాయి. వేణు కథ అతనికి తెలియకుండా పెంచాలని చూశారు రెడ్డి దంపతులు. కాని లోకం వూరుకుంటుందా? అయినా రెడ్డి దంపతులు, వారి ప్రవర్తనలో వేరు భావం గోచరించనిచ్చేవారుకారు. వేణు కాస్త సంశయంగా వుంటున్నందుకు సున్నితంగా ప్రేమతో మందలించారా దంపతులు. వేణుకు రెడ్డి దంపతులపై మునుపటి కంటె భక్తి భావం బలపడింది. వేణు అదృష్టవంతుడని కొందరానందిస్తుంటే, తమకు దక్కని అదృష్టాన్ని నిందించలేక వేణును చూసి అసూయపడేవారు మరికొందరు.

రెడ్డి ఆస్తి కోసం పొంచివున్న వారి దాయాదులకు, రెడ్డిపైన, వేణుపైన క్రోధం ఎక్కువ కాసాగింది అందుకే రెడ్డి కులస్తులకు "కీ" ఇచ్చి వదిలారు. సమయం కోసం వేచివున్నారు. ఆ రోజు "మారెమ్మ" జాతర. ఆనవాయితీ ప్రకారం, ముందుగా నరసారెడ్డి "మేకపోతు" బలి కావాలి. కాని "కీ" ప్రభావంలోవున్న కులస్థులు అభ్యంతరం చెప్పారు. హరిజన బాలుణ్ణి పెంచుకుంటున్నందువల్ల నరసారెడ్డి మారెమ్మకు ముందు "బలి" యివ్వరాదన్నారు. గొడవ జరిగింది. ఆ గొడవలో రెడ్డి ప్రాణం పోయింది. విషయం విన్న రెడ్డిగారి భార్య చేషలుడిగిపోయింది. అప్పుడే పొలం పని నుంచి వచ్చిన వేణు వార్త విని ప్రమాన్పడిపోయాడు క్రోధంతో కంపించాడు. యువక రక్తం పరవళ్ళు త్రొక్కి కళ్ళ నిండుగా ప్రతీకారం క్రమ్మింది. మూలనున్న గొడ్డలి భుజంపై కొచ్చింది. కాళ్ళు స్థలంవేపు కదిలాయి. ఎదురొచ్చిన తలలు ఎగిరాయి. ఎన్నో తెలియదు. వేణుకు వళ్ళు తెలియటంలేదు. కాని చేతిలో గొడ్డలి మాత్రం ఆడుతూనేవుంది. కబురు విన్న తరువాత వచ్చిన పోలీసు బలగం, వేణు అరెస్టు తరువాత శవాలను పదిహేడుగా లెక్కించారు.

మారెమ్మకు జరగాల్సిన బలికి బదులుగా, తండ్రిలాటివాడికి వేణు రక్తతర్పణం చేశాడనుకున్నాను. కాని వేణు పనిని చట్టం హర్షించదుగదా!

—ప్రసాద్